క్లుప్తంగా

21 నుంచి పర్యావరణ పక్షోత్సవాలు



సచివాలయ సిబ్బందితో పర్యావరణ సర్క్యులర్ ఆవిష్కరణ

సామర్లకోట: వచ్చే నెల ఐదో తేదీన నిర్వహించే పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే 'మేరీ లైఫ్–మేరా స్వచ్ఛ షహర్'కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ మేరకు గురువారం పర్యావరణ సర్క్యులర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి జూన్ 4వ తేది వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

23న మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ అబ్రహం లింకన్ గురువారం తెలిపారు. దీనికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా నేరెళ్లమ్మ తల్లి జాతర



గ్రామంలో సాగుతున్న గరగల ఊరేగింపు

కొత్తపల్లి: కొమరగిరి గ్రామంలో వేంచేసియున్న నేరెళ్లమ్మ తల్లి అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. గరగ నృత్యాలతో చిరు తాడిని గ్రామంలో ఊరేగించారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో మదుగులమ్మ జాతర

సామర్లకోట: హుస్సేన్‌పురంలో వేంచేసియున్న మదుగులమ్మ జాతర గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. జాతరలో భాగంగా గరగలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త చల్లా బుజ్జి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

చదరంగంతో ఏకాగ్రత



చిన్నారులకు చదరంగంపై శిక్షణ ఇస్తున్న సంతోష్

పెద్దాపురం: ప్రతి వ్యక్తిలో ఏకాగ్రతను పెంచేందుకు చదరంగం ఎంతగానో దోహదపడుతుందని అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు ముప్పన సంతోష్ అన్నారు. వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ఆయన సందర్శించి చెస్‌లో చిన్నారులకు మెళకువలు నేర్పారు. శిబిరం కన్వీనర్ రొంగల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంతోష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెస్‌పై ఆసక్తిని పెంచుకోవడం ద్వారా మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. అనంతరం పీసీసీ శిబిరంలో ఏర్పాటు చేసిన తొమ్మిది చెస్ బోర్డుల్లో క్రీడను ఆడి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కూనిరెడ్డి అరుణ, రవికుమార్, డి.కృష్ణ, అమృత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేసిన చిన్నయ్యదొర

సామర్లకోట: భారత మాత సేవా పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం వంద మంది పేదలకు వస్త్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చక్రధరరావు 13వ వర్ధంతి సందర్భంగా ప్రస్తుత అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎలిశెట్టి ప్రజ్ఞ, సత్యనారాయణపురంలో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న విన్నకోట సురేష్‌ను సత్కరించారు. అలాగే అనారోగ్యంతో బాధ పడుతున్న మహిళకు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక డాక్టరు పసల సత్యానందరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేకువన హిమపాతం..

ఆపై ఉష్ణఘాతం

- వేకువన పలు గ్రామాలను కమ్ముతున్న పొగమంచు
- ఆపై చెలరేగుతున్న సూరీడు
- విచిత్ర వాతావరణంతో జనం ఉక్కిరిబిక్కిరి



పిఠాపురం - ఉప్పాడ రోడ్డులో ఉదయం కమ్ముకున్న మంచు తెరలు

కొత్తపల్లి: ప్రస్తుతం అగ్నికార్తె నడుస్తోంది. మరో వారం రోజుల్లో రోళ్లు పగిలే రోహిణీ కార్తె మొదలు కానుంది. దీనికి సన్నాహమా అన్నట్టుగా నింగిన సూరీడు కొద్ది రోజులుగా నిప్పు కణికలు కురిపిస్తున్నాడు. 42 డిగ్రీల సెల్సియస్‌కు పైబడిన ఉష్ణోగ్రతలతో చెలరేగిపోతున్నాడు. ఉదయం తొమ్మిది దాటితే చాలు.. బయటకు రావాలంటేనే జనం హడలెత్తిపోతున్నారు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వేడి గాలులతో నానా అవస్థలూ పడుతున్నారు. ఉక్కపోతతో ఆపసోపాలు పడుతున్నారు.

ఓవైపు పట్టపగలు ఇలా సెగలు పుట్టిస్తూ మండిపోతుండగా.. మరోవైపు వేకువజామున పలు గ్రామాల్లో విచిత్ర వాతావరణం కనిపిస్తోంది. చలి కాలంలో మాదిరిగా మంచు కురుస్తోంది. కొన్నిచోట్ల దట్టమైన పొగమంచు అలముకుంటోంది. రోడ్లపై ప్రయాణిస్తున్న వారికి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించనంతగా.. ఆ సమయంలో మంచుతెరలు కమ్ముకుంటున్నాయి. బయట ఉన్న వస్తువులు, వాహనాలు మంచుతో తడిసిపోతున్న పరిస్థితి కూడా కొన్నిచోట్ల కనిపిస్తోంది. ఇంచుమించు ఉదయం 8 గంటల వరకూ మంచు వాతావరణం నెలకొంటోంది. ఆ తరువాత పగబట్టినట్టుగా ప్రచండ భానుడు చండప్రచండంగా చెలరేగిపోతున్నాడు.



పగటి వేళ సూర్య ప్రతాపంతో నిర్మానుష్యంగా మారిన పిఠాపురం - ఉప్పాడ రోడ్డు

సాధారణంగా శరదృతువు మొదలైనప్పటి నుంచి మంచు వాతావరణం కనిపిస్తుంది. ఇంచుమించు ఫిబ్రవరి నెలాఖరు వరకూ హిమపాతం ఉంటుంది. ఆ తరువాత ఎండలు పెరగడంతో క్రమంగా మంచుతెరలు మాయమవుతాయి. ఇప్పుడు వసంత రుతువు. ఈ నెలాఖరు నుంచి గ్రీష్మ రుతువు మొదలవుతుంది. ఇటువంటి తరుణంలో మే నెలలో తీవ్రమైన ఎండలు ఉండటం సర్వసాధారణమే. అయితే, ఈ కాలంలో మంచు కురవడమే కాస్త వింతగా కనిపిస్తోంది. ఇటువంటి వాతావరణాన్ని మునుపెన్నడూ చూడలేదని పలువురు ఆశ్చర్యపోతున్నారు. ఈ అసాధారణ వాతావరణంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పేదలందరికీ ఇళ్లు ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- సమస్యలు పరిష్కారం కాకపోతే తన దృష్టికి తేవాలని ప్రజలకు సూచన
- ఎల్ఎన్ పురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఎల్ఎన్ పురంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఎమ్మెల్యే దొరబాబును సత్కరిస్తున్న మంగితుర్తి సర్పంచ్ శివజ్యోతి

పిఠాపురం: పేదలందరికీ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ ధ్యేయంతోనే నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం అమలు చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఎల్ఎన్ పురంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎవరికి ఏ పథకం అందుతోందో వివరించి, అవన్నీ సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడటం, పేదలందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో డ్రైన్లు సక్రమంగా లేవని, వెంటనే నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి, తనకు తెలియజేయాలని అక్కడే ఉన్న అధికారులను దొరబాబు ఆదేశించారు. ఇప్పుడు చెప్పిన పనులు పూర్తి కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. పాలనను ప్రజల చెంతకు తీసుకువచ్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ప్రారంభించిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకూ సమ న్యాయం చేస్తున్నారని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వివిధ పథకాలు అమలు చేస్తూ జన పక్షపాతిగా పాలన సాగిస్తున్నారని అన్నారు. ఏ గ్రామంలోనైనా ఎవరైనా ఇక్కడ తమకు ఫలానా సమస్య ఉందని చెబితే.. దానిని వెంటనే పరిష్కరించాల్సిందేనని, లేకుంటే అది ఎందుకు పరిష్కారం కాలేదో వారికి చెప్పాల్సిందేనని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల ఏడుకొండలు, కర్రెడ్ల తాతీలు, దివిటీల వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దొరబాబు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ సేవలు సత్వరం అందుతున్నాయో లేదో ఆరా తీశారు.

'గడప గడపకూ మన ప్రభుత్వం'తో మా గ్రామానికి మేలు

''ఎన్నికల సమయంలో మా ఇళ్లకు వస్తారు.. అధికారం రాగానే మేమెవరో తెలియనట్టు నటిస్తారు. ఇదీ రాజకీయ నేతల తీరు. దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి చూపించారని మంగితుర్తి సర్పంచ్ కసిరెడ్డి శివజ్యోతి అన్నారు. నిధులు మంజూరు చేసి, తమ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించినందుకు ఎమ్మెల్యే పెండెం దొరబాబును పిఠాపురంలోని ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. భారీ సన్మాన పత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయం కానప్పటికీ.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకోవాలనేది సీఎం వైఎస్ జగన్ తీసుకున్న గొప్ప నిర్ణయమని కొనియాడారు. ఇది ఎన్నో గ్రామాలకు మంచి చేస్తోందని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం తమ గ్రామానికి ఎంతో మేలు చేసిందని, ఎమ్మెల్యే దొరబాబు మండుటెండలో తమ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారని, రూ.20 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. తద్వారా ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపించారని సర్పంచ్ శివజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తుని ఆర్పీల శిక్షణ

సామర్లకోట: రిసోర్సు పర్సన్లు శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని మెప్మా జిల్లా రిసోర్సు పర్సన్ ఎల్.జయరాజ్ అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ జిల్లా మెప్మాలో పని చేస్తున్న ఆర్పీలకు స్థానిక టీటీడీసీలో శిక్షణ ఇస్తున్న విషయం విదితమే. దీనిలో భాగంగా తుని మున్సిపాలిటీ పరిధిలోని ఆర్పీలకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ గురువారం ముగిసింది.

సత్యదేవుని సన్నిధానం.. దేదీప్యమానం



ధగద్ధగాయమానంగా మెరిసిపోతున్న తూర్పు రాజగోపురం

అన్నవరం: కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలతో సత్యదేవుని సన్నిధి సరికొత్త కాంతుల్ని అద్దుకుంది. తూర్పు రాజగోపురం దిగువన గ్రానైట్ పలకలు అతికించిన మెట్లకు ఇరువైపులా విద్యుత్ దీపాల ఏర్పాటు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ దీపాలను గురువారం రాత్రి వెలిగించారు. తూర్పు రాజగోపురం నుంచి దిగువన ఘాట్ రోడ్డు వరకూ గతంలో 103 రాతి మెట్లు ఉండేవి. ఒంగోలుకు చెందిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, రాజమహేంద్రవరానికి చెందిన జ్యోతి గ్రానైట్స్ అధినేత మన్యం ఫణి రూ.20 లక్షల విలువైన గ్రానైట్ విరాళంగా అందజేసి, మెట్లకు అతికించాలని కోరారు. అందుకయ్యే ఖర్చును కూడా వారే భరించారు. మెట్లకు ఇరువైపులా ఉన్న గోడలకు కూడా గ్రానైట్ పలకలు అతికించారు. మధ్యలో బూడిద రంగు, రెండువైపులా తెలుపు రంగు గ్రానైట్ రాళ్లతో ఈ మెట్లు చాలా ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశానుసారం దాతల సహకారంతో రాజగోపురం నుంచి దిగువ ఘాట్‌రోడ్ వరకూ ఉన్న మెట్లకు ఇరువైపులా 206 ఎల్ఈడీ విద్యుద్దీపాలు ఏర్పాటు చేశామని దేవస్థానం విద్యుత్ శాఖ డీఈ టి.సూర్యనారాయణ తెలిపారు. దీంతో ఈ మెట్లు రాత్రి వేళ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. మెట్లు పూర్తిగా కనిపిస్తూండటంతో వాటిని ఎక్కేందుకు, దిగేందుకు భక్తులకు మరింత సౌలభ్యం ఏర్పడింది. ఈ ఎల్ఈడీ విద్యుద్దీపాలను కూడా శిద్దా రాఘవరావు, మన్యం ఫణి అందజేశారని సూర్యనారాయణ తెలిపారు.



రాజగోపురం మెట్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

వనదుర్గ అమ్మవారికి నేడు హోమాలు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి వైశాఖ అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ ఈ హోమాలు జరుగుతాయి. భక్తులు రూ.750 టికెట్టుతో హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. రామాలయం వద్ద బుకింగ్ కౌంటర్, వనదుర్గ ఆలయం వద్ద టికెట్లు లభిస్తాయని తెలిపారు.

ముగియనున్న నేరేళ్లమ్మ తల్లి జాతర

అన్నవరం గ్రామ దేవత నేరేళ్లమ్మ అమ్మవారికి పది రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు శుక్రవారం ముగియనున్నాయి. ఈ సందర్భంగా జాతర, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామంలో సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

గోర్సలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

కొత్తపల్లి: మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ గోర్స గ్రామంలో గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను రాజమహేంద్రవరంలో జరిగే మహానాడు కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలి

- టెన్త్, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

పిఠాపురం: ప్రధానోపాధ్యాయులందరూ వెంటనే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) నాగమణి ఆదేశించారు. పిఠాపురం బాదం మాధవరావు బాలికోన్నత పాఠశాలలో పిఠాపురం విద్యా శాఖ డివిజన్‌లోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాచ్‌మెంట్ ఏరియాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి, వలంటీర్లు, విద్యాశాఖ వెల్ఫేర్ అసిస్టెంట్ల సహకారంతో ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ తయారు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకూ దీనిని అమలు చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. నాడు–నేడు పనులను వచ్చే 12వ తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రశస్త యాప్‌ను అందరూ తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని, వినియోగించాలని నాగమణి సూచించారు. జిల్లా విద్యా శాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఈఓ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

సాగు హక్కు పత్రాలపై అవగాహన అవసరం



పీబీ దేవంలో మాట్లాడుతున్న ఏఓ సత్య

సామర్లకోట/పెద్దాపురం: రైతులు, కౌలు రైతులు సాగు హక్కు పత్రాలపై అవగాహన పెంచుకోవాలని సామర్లకోట, పెద్దాపురం ఎంఏఓ లు ఐ.సత్య, కె.సంజయ్‌కుమార్ సూచించారు. సామర్లకోట మండల పరిధి పీబీ దేవం ఆర్బీకేలో, పెద్దాపురం మండల పరిధి ఆనూరు ఆర్బీకే వద్ద రైతులకు, కౌలు రైతులకు ఈ మేరకు వారు వివిధ అంశాలను వివరించారు.

కౌలు కార్డుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సాగు పత్రం ప్రయోజనాలను ఏఓలు వివరించారు. కౌలుకు సాగు చేసే రైతుల వద్ద కచ్చితంగా సాగుపత్రం ఉండాలన్నారు. పంట విక్రయం, ఎరువులు, పంట నష్టం, సబ్సిడీ వంటి విషయాల్లో ఈ పత్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్డు కావలసిన రైతులు పొలం పాస్‌బుక్, రైతు ఆధార్, ఫోన్ నెంబర్, కౌలు రైతు ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో సంబంధిత వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేసి పొందాలని సూచించారు. సాగుదారుకు రుణ అర్హత, భూ యజమానికి చట్టబద్ధ హామీ ఆంధ్రప్రదేశ్ పంట సాగు హక్కు చట్టం 2019 సెక్షన్ 3 (2), 8 (ఎ) ప్రకారం కాల పరిమితి 11 నెలలు కార్డు ఉపయోగపడుతుందన్నారు. కౌలు కార్డు తీసుకున్న రైతులకు మాత్రమే పంట నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. కౌలు కార్డుతో సున్నా వడ్డీ రుణాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు కౌలు రైతుల భరోసా రూ.13,500 లభిస్తుందని తెలిపారు. వీటిపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. సామర్లకోటలో ఎంపీటీసీ సభ్యుడు మలకల సూర్యారావు, ఆనూరులో వ్యవసాయ సహాయకుడు జి.చంద్రరావు ఈ కార్యక్రమాలకు అధ్యక్షత వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, వీఆర్వోలు తదిరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోపాలు సరిచేయాలి



ఏడీఈకి వినతి పత్రం అందజేసిన కౌన్సిలర్లు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో తరుచూ ఏర్పడుతున్న విద్యుత్ సమస్యలను సరి చేయాలని కౌన్సిలర్లు గురువారం ఏడీఈ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో విద్యుత్ కోత లేకపోయినా మున్సిపాలిటీ పరిధిలో మూడు రోజులుగా కొన్ని వార్డుల్లో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా ఉండటం లేదని కౌన్సిలర్లు పితాని కృష్ణ, గుబ్బల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, పెండ్యాల అబ్బు, చిట్టుమాని శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావులు వినతి పత్రం అందజేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వారు విజ్ఞప్తి చేశారు.

సేవా మార్గాన్ని అలవరచుకోవాలి

కాకినాడ సిటీ: ప్రతి ఒక్కరూ సేవా మార్గాన్ని అలవరచుకోవాలని కాకినాడ బార్ అసోసియేషన్ లేడీ రిప్రజెంటేటివ్ జి.సునీత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాగిరెడ్డి వెంకట జయరాం కుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో ఆమె మజ్జిగను అందజేసారు. కరోనా సమయంలో మరణించిన 10 మంది జర్నలిస్టుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని నిరాటంకంగా కొనసాగించడం అభినందనీయమన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన కక్షిదారులకు, బాటసారులు, వాహనచోదకులు, ఆటోవాలాలకు మజ్జిగను అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా సభ్యురాలు ఉద్దండ ఉమాగౌరి, జీవీ రావు, సీనియర్ న్యాయవాది కేవీవీ చలపతి, అసోసియేషన్ అధ్యక్షుడు మంగం శివరామకృష్ణ తదితరులు పాల్గొని కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలను అభినందించారు.

ట్రాక్ ఎక్కిన జీవన రైలు

- రైల్వేలో ఉద్యోగం సాధించిన వలంటీర్
- అభినందించిన గ్రామస్తులు



వలంటీర్‌గా వర్షంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న చక్రవర్తి



ఉద్యోగం సాధించిన చక్రవర్తిని అభినందిస్తున్న గ్రామ పెద్దలు

పిఠాపురం: ఆ యువకుడిది నిరుపేద కుటుంబం. తండ్రి రెక్కలు ముక్కలు చేసుకుంటూ తెచ్చే కూలి డబ్బులతో కుటుంబం గడవడమే కష్టంగా ఉండేది. అయినప్పటికీ బిడ్డల్ని కష్టపడి చదివించాడు. బంగారు భవిష్యత్తు లభిస్తుందనే కోటి ఆశలతో ఆ యువకుడు ఉన్నత విద్య అభ్యసించాడు. అయితే చదువు పూర్తి కాగానే అతడికి ఉద్యోగం లభించలేదు. దీంతో, తండ్రికి చేదోడుగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ వలంటీర్‌గా సేవలందించడం ఆరంభించాడు. నిస్వార్థంగా అందించిన ఆ సేవల ఫలితమో ఏమో కానీ.. ఆ యువకుడు ఏకంగా రైల్వేలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

యు.కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన ఈ యువకుడి పేరు గాది చక్రవర్తి. పేరుకే చక్రవర్తి కానీ.. అతడిది రెక్కాడితేనే కానీ డొక్కాడని కుటుంబం. తల్లిదండ్రులకు ముగ్గురు మగ బిడ్డలు. వారిలో రెండో వాడు చక్రవర్తి. తండ్రి కూలి పని చేసుకుంటూనే పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలనే ఉద్దేశంతో బాగా చదివించాడు. తండ్రి ఆశల్ని చక్రవర్తి గుర్తించాడు. కష్టపడి బీటెక్ చదివాడు. అనంతరం మంచి ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఫలితం లేకపోయింది. తండ్రి తెస్తున్న కూలి డబ్బులతో కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో ఏదో ఒకటి చేసి నాన్నకు చేదోడుగా నిలవాలని చక్రవర్తి నిర్ణయించుకున్నాడు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాలేదు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలనుకున్నా కుటుంబ పరిస్థితి సహకరించేది కాదు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహించినప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇది చక్రవర్తికి కొండంత ధైర్యాన్నిచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత గ్రామ/వార్డు సచివాలయాలతో పాటు వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. దీనిని చక్రవర్తి చక్కగా వినియోగించుకున్నాడు. ఎటువంటి పరీక్షా రాయకుండానే ఒక్క దరఖాస్తు, ఇంటర్వ్యూతో వలంటీర్‌గా ఎంపికయ్యాడు. వలంటీర్‌గా అతడికి వచ్చే భృతి ఆ కుటుంబానికి మరికొంత ఆసరానిచ్చింది.

వలంటీర్‌గా సేవలందిస్తూనే చక్రవర్తి మరోపక్క పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యాడు. మొత్తమ్మీద అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. రైల్వేలో ట్రాక్‌మన్‌గా ఎంపికయ్యాడు. తద్వారా తన జీవిత రైలు పట్టాలెక్కిందని చక్రవర్తి సంబర పడుతున్నాడు. తాను ఉద్యోగం సాధించేందుకు అవసరమైన ధీమాను, చేయూతను వలంటీర్ పోస్టు ఇచ్చిందని ఆనందంగా చెబుతున్నాడు. సీఎం వైఎస్ జగన్‌కు తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని చక్రవర్తి అంటున్నాడు. వలంటీర్‌గా ప్రజలకు సేవలందిస్తూ మంచి ఉద్యోగం సాధించిన చక్రవర్తిని గ్రామస్తులు అభినందించారు.